నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, శుక్రవారం 20 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

పెద్ద ధన్వాడకు పండుగొచ్చింది..

రాజోళి మండలం పెద్ద ధన్వాడ శివారులోని తుంగభద్ర నదిలో ఎద్దులకు స్నానం చేయిస్తున్న రైతులు

తొమ్మిది రోజుల తర్వాత ఏరువాక

పెద్ద ధన్వాడలో ఏరువాక పండుగ ఘనంగా జరిగింది. ఇండ్లకు మామిడి తోరణాలు పండుగ వాతావరణాన్ని తీసుకురాగా.. లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. తుంగభద్ర నదిలో కాడెద్దులకు స్నానం చేయించి.. వాటిని రైతులు అందంగా అలంకరించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. పిండి వంటలు చేసి.. ఇంటిల్లిపాది విందు భోజనాలు ఆరగించారు. జైలు నుంచి 12 మంది రైతులు విడుదల కావడంతో 9 రోజుల తర్వాత గ్రామ ప్రజలు, రైతులు సంబురంగా పండుగలో భాగస్వాములయ్యారు.

– అయిజ/అలంపూర్, జూన్ 19

ఎడ్లకు రంగు లేస్తున్న రైతు

- ఇంటిల్లిపాది ఘనంగా పండుగ
- జైలు నుంచి 12 మంది రైతుల విడుదలతో సంబురంగా ఉత్సవం
- మామిడి తోరణాలు.. ముగ్గులతో ఇండ్లు అలంకరణ
- రంగులతో కాడెద్దుల ముస్తాబు
- గ్రామ దేవతలకు మొక్కుల చెల్లింపు

అయిజ/అలంపూర్, జూన్ 19 : రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో గురువారం ఏరువాక పండుగను ప్రజలు, రైతులు సంబురంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రైతులు తుంగభద్ర నదిలో కాడెద్దులకు స్నానం చేయించి, కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేశారు. తెల్లవారు జాము నుంచి ఇండ్ల ముంగిట కల్లాపు చల్లి, ముగ్గులు వేసి, పిండివంటలు చేసుకొని పిల్లా పాపలతో గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గతేడాది నుంచి గ్రామ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. దాదాపు 12 గ్రామాల ప్రజలు, రైతులు మూకుమ్మడిగా నిరసనలు చేపడుతున్నారు. అయినా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం పెద్ద ధన్వాడలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ఈ నెల 4న బౌన్సర్లు, పోలీసులతో యాజమాన్యం రైతులపై దాడులు చేయగా, రైతులు ఫ్యాక్టరీకి చెందిన కంటైనర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో పోలీసులు 40 మందిపై కేసులు నమోదు చేసి, 12మందిని అరెస్టు చేసి, పాల మూరు జైలుకు తరలించారు. 15 రోజులుగా ఆవేదనతో ఉన్న రైతులు, గ్రామస్తులు అక్రమ కేసులో జైలుకు వెళ్లిన తమవారు బుధవారం రాత్రి ఇండ్లకు చేరుకోవడంతో సంతోషంతో ఏరువాక పండుగను జరుపుకొన్నారు.

తొమ్మిది రోజులకు 'ఏరువాక'

నడిగడ్డలో మొట్ట మొదటిగా వచ్చే పండుగ ఏరువాక. ప్రతి ఏటా ఏడు రోజుల్లో ఏదో ఒక రోజు ఏరువాక పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. కానీ పెద్ద ధన్వాడ రైతులు జైలుకు వెళ్లడంతో ఈ నెల 11న జరుపుకోవాల్సిన ఏరువాక పండుగను గ్రామస్తులు జరుపుకోలేదు. పండుగ రోజు గ్రామం బోసిపోయింది. గ్రామ దేవతల ఆలయాలకు రైతులు, ప్రజలు చేరుకోక పోవడంతో మూతపడ్డాయి. జైళ్లకు వెళ్లిన తమవారు ఇండ్లకు చేరుకున్నాకే ఏరువాక జరుపుకొంటామని గ్రామస్తులు తీర్మానించుకున్నారు. శుక్రవారం రైతుల కళ్లలో కొంత మేరకు సంతోషం కలగడంతో పండుగను జరుపుకోవాలని బుధవారం రాత్రి చాటింపు చేసి, గురువారం పండగను జరుపుకొన్నారు. కాడెద్దులను ముస్తాబు చేయడం, వ్యవసాయ పనిముట్లను సరి చేసుకోవడం, గ్రామ దేవతలు సుంకులమ్మ, సవారమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగను పురస్కరించుకొని గ్రామస్తులు ఇండ్లలో పిండి వంటలు చేసుకొని పిల్లా పాపలతో విందు భోజనం ఆరగించారు.

ఒకవైపు సంతోషం.. మరోవైపు ఆందోళన..

ఇథనాల్ ఫ్యాక్టరీ ఘటన నేపథ్యంలో గత 15 రోజులుగా గ్రామంలోని ప్రజలు, రైతులు ఆందోళనలోనే ఉన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫిర్యాదుతో 40మందిపై కేసులు నమోదుకాగా, 12 మందిని 14 రోజులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం కోర్టు 12 మందికి బెయిల్ మంజూరు చేయడంతో ఇండ్లకు చేరుకున్నారు. జైలు నుంచి 12మంది ఇండ్లకు వచ్చారనే ఒక వైపు సంతోషం ఉన్నప్పటికీ, మరో వైపు 28మందిని ఎప్పుడు తీసుకెళ్తారోనని ఆందోళనతో గ్రామస్తులు ఉన్నారు. ఏరువాక పండుగ జరుపుకొంటున్నా.. వారిలో సంతోషం కనిపించలేదు. అంతేకాకుండా రైతులకు కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేయడంతో వారిలో ఆనందం కనిపించలేదు.

పెద్ద ధన్వాడలో సుంకులమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకుంటున్న ప్రజలు, ఎడ్లబండ్లతో రైతులు

ఫ్యాక్టరీ రద్దు చేస్తేనే నిజమైన పండుగ

పెద్ద ధన్వాడ గ్రామంలోని ఏర్పాటు చేయతల పెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసి, కేసులు ఎత్తివేస్తేనే 12 గ్రామాల్లో నిజమైన పండుగ వాతావరణం కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు. ఏడాదిగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వం, పోలీసుల ప్రోద్బలంతో ఫ్యాక్టరీ ఏర్పాటుకు పూనుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు, గ్రామాలు, తుంగభద్ర నదీ జలాలను కలుషితం చేసే ఫ్యాక్టరీ మాకొద్దని మొత్తుకుంటున్నా.. సర్కారు పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

శిథిలావస్థలో కళాశాల తరగతి గది

- శిథిలావస్థలో అచ్చంపేట జూనియర్ కళాశాల
- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు.. తగ్గిన అడ్మిషన్లు
- కేసీఆర్ ప్రభుత్వంలో రూ.3 కోట్లు మంజూరు
- కాంగ్రెస్ సర్కారు రావడంతో నిధులు ల్యాప్స్

అచ్చంపేటటౌన్, జూన్ 19 : ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థితికి తీర్చిదిద్దిన అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. స్టూడెంట్స్‌కు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. భవనం పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. తరగతి గదుల్లో కూర్చోవాలంటేనే ఎప్పుడు పెచ్చులు ఊడిపడ్తాయేమోనని అధ్యాపకులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. జెంట్స్ కళాశాల ఆరుబయటే పని కానిచ్చేస్తున్నారు. కొత్త టాయిలెట్లు నిర్మించినా ఇంకా అందుబాటులోకి రాలేదు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండగా.. గతేడాది దాతల సహకారంతో సమస్య కొంత తీరింది. ఈ సమస్యలను చూసి కొత్తగా కళాశాలలో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థులు రావడం లేదని లెక్చరర్లు చెబుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలోని నిధులు ల్యాప్స్

అచ్చంపేటలోని కాలేజీ గతంలో బాలుర కళాశాలగా ఉండగా.. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థినులను దృష్టిలో ఉంచుకొని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతులతో 2016-17 నుంచి కో-ఎడ్యుకేషన్ ప్రారంభమైంది. అయితే భవనం పాతబడిపోవడంతో కళాశాల అభివృద్ధి పనులకు కేసీఆర్ ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. తర్వాత అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో నిధులు మంజూరు కాకుండానే ల్యాప్స్ అయ్యాయి. ప్రస్తుతం భవనం అధ్వాన్నంగా తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాలలో అదనపు గదులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన విద్యకు బాటలు వేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పైకప్పు ఊడిపడిన పెచ్చులు

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..

- రెండు గదులు.. 45 మంది విద్యార్థులు.. ఇద్దరు టీచర్లు
- సమస్యలకు కేరాఫ్‌గా రామచంద్రానగర్ పాఠశాల
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

వడ్డేపల్లి, జూన్ 19 : శాంతినగర్‌లోని రామచంద్రానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. ఒకటి నుంచి 5 వరకు తరగతులు నిర్వహిస్తుండగా 45 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి బోధించేందుకు కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. అదనపు తరగతుల కోసం నూతన భవనం నిర్మించినా.. ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరింది. మొదటి అంతస్తులోని భవనం కోసం ఏర్పాటు చేసిన మెట్లు మధ్యలోనే ఊడిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పైకి వెళ్లడం లేదు. దీనికి తోడు వంట గది అసలు లేదు.. బాలురకు టాయిలెట్స్ లేక ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో మెరుగైన వసతులు, భవనానికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రామచంద్రానగర్ పాఠశాల భవనం పై అంతస్తు మెట్లు

ఉపయోగంలో లేని భవనం

అయోధ్యనగర్

- పేదల ఇండ్లపైకి 8 బుల్డోజర్లు
- అక్రమ నిర్మాణాలంటూ 34 కూల్చివేత
- పోలీస్ బందోబస్తు మధ్య నేలమట్టం
- మిన్నంటిన బాధితుల రోధనలు
- ప్రభుత్వం, అధికారులపై శాపనార్థాలు

చార కొండ, జూన్ 19 : గురువారం తెల్లవారు జామున 5:30 గంటలకే ఇండ్లపైకి బుల్డోజర్లు.. అడ్డుకొనేందుకు స్థానికుల యత్నాలు.. అప్పటికే మోహరించిన పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకోవడం.. కష్టపడి కట్టుకున్న నిర్మాణాలు నేలమట్టమవడం.. మిన్నంటిన స్థానికుల రోధనలు.. అయోధ్యనగర్‌లో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబర్ 327లో 9.11 ఎకరాలు, మరో సర్వే నెంబర్ 328లో 7.06 ఎకరాల్లో 50 ఏండ్ల నుంచి ఎందరో ఇక్కడే ఉంటూ జీవనాధారం పొందుతున్నారు. అయితే ఆలయ భూములను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని అధికారులు కోర్టును ఆశ్రయించారు. దీంతో గతేడాది జనవరిలో ఆక్రమణలు తొలగించాలని కోర్టు తీర్పునిచ్చింది. అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో కోర్టు సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీస్, ఎండోమెంట్ అధికారులు సమావేశమై వెంటనే కూల్చివేతలకు సిద్ధమయ్యారు. ఇండ్లవాసులకు ఒక్కరోజు గడువు ఇచ్చి.. ముగిసిన తర్వాత 8 జేసీబీలతో ఇండ్లపైకి వెళ్లారు. అప్పటికే భారీగా పోలీసులను ఆ ప్రాంతంలో మోహరించారు. కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, అధికారుల ఆధ్వర్యంలో మొత్తం 34 నిర్మాణాలు అక్రమంగా నిర్మించారని గంటల్లోనే నేలమట్టం చేశారు.

అయోధ్యనగర్‌లో ఇల్లు కూల్చి వేయడంతో రోడ్డున పడి రోధిస్తున్న ఓ కుటుంబం

కాళ్లావేళ్లాపడినా.. కనికరం లేకుండా..

సిరుసనగండ్ల పరిధిలోని అయోధ్యనగర్‌లో అక్రమంగా నిర్మించారని ఇండ్లను కూల్చివేస్తుంటే.. వద్దని బాధితులు అధికారులకు దండం పెట్టి.. కాళ్లా.. వేళ్లా పడ్డారు. అయినా కనికరం లేకుండా కూల్చివేతలు కొనసాగించారు. అడ్డుకోవడానికి యత్నించినా పోలీసులు వారిని వారించారు. కొన్ని రోజులు సమయం ఇవ్వాలని వేడుకున్నా ఒప్పుకోలేదు.. కనీసం ఇండ్లల్లోని సామాన్లు కూడా తీసుకోకుండానే కూల్చివేతలు చేపట్టారు. దీంతో ఆలయ అధికారులు, ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టారు. ఇండ్లు కూలిపోతుంటే వారి రోధనలు వర్ణనాతీతం. మా ఇండ్లు కూల్చడంతో గూడు చెదిరిన పక్షులం అయ్యామని.. ఆ భగవంతుడు ఇలా చేస్తాడని అనుకోలేదని మహిళలు, వృద్ధులు కన్నీరు మున్నీరయ్యారు.

ఇండ్లు కూల్చడంతో రోధిస్తున్న మహిళలు

రాజకీయ కక్షతోనే ఇండ్లు కూల్చివేత : బీఆర్ఎస్

సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో మొత్తం నిరుపేదలకు చెందిన ఇండ్లనే కూల్చివేశారని, ఇదిముమ్మాటికీ రాజకీయ కక్షతోనే జరిగిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నేతలు రమేశ్, రామకృష్ణ, సలీం, శ్రీను ఆరోపించారు. బాధితులు సమయం ఇవ్వాలని కోరినా అధికారులు కనికరించలేదని, ప్రత్యామ్నాయం చూపకుండానే ఇండ్లను కూల్చి పేదలను రోడ్డున పడేశారని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఇంటిస్థలాలు కేటాయించి.. ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూల్చివేతలను తాసీల్దార్ సునీత, ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మదన్ శేఖర్‌రెడ్డి, ఈవో ఆంజనేయులు, సీఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజు, నాగార్జున, ఎస్సై శంషొద్దీన్ ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

అయోధ్యనగర్‌లో ఇండ్లను కూల్చుతున్న జేసీబీ

జూరాలకు పెరిగిన వరద

- ఇన్‌ఫ్లో 40 వేలు, అవుట్‌ఫ్లో 52,468 క్యూసెక్కులు

గద్వాల, జూన్ 19 : ఎగువన కురుస్తున్న వర్షాలతో మలప్రభ నదీ పరివాహక ప్రాంతం నుంచి అల్మట్టి ఆనకట్టకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో నారాయణపూర్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 75,000 క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉండడంతో, ఆ నీరు జూరాలకు వచ్చి చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమై జూరాల ప్రాజెక్టు నాలుగు గేట్లు తెరిచి దిగువకు 15,516 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.279 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు 38వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. విద్యుదుత్పత్తికి 36,415 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఇన్‌ఫ్లో 40వేలు క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 52,468 క్యూసెక్కులుగా నమోదైంది.

జూరాల ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేసిన నీరు

తుంగభద్రకు పోటెత్తిన వరద

అయిజ, జూన్ 19 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. తుంగ బరాజ్ గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని విడుదల చేస్తుండటంతో గురువారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 51,654 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 215 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠ స్థాయి నీటిమట్టం1633 అడుగులకుగానూ ప్రస్తుతం 1608.23 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 34.221టీఎంసీల నీటి నిల్వ ఉంది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా చేరుతోంది. ఇన్‌ఫ్లో 834 క్యూసెక్కులు ఉండగా, దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు 642క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 192 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.2 అడుగుల మేర నీటిమట్టం ఉంది.

రైతులకు 'భరోసా' ఏదీ..?

- వ్యవసాయ అధికారులను నిలదీసిన రైతులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుభరోసా సాయం అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు చేతమోని నాగమ్మ మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి వచ్చింది. తన భూమి పాస్ బుక్కు తీసుకొచ్చి ఏవో చిన్న హుస్సేన్ యాదవ్ వద్దకు వెళ్లి పెట్టుబడి సాయం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీసింది. రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసీఆర్ హయాంలో ఏడాదికి రెండు సార్లు రైతుబంధు సకాలంలో అందేదని, కాంగ్రెస్ వచ్చాక ఒక్కసారి కూడా పడలేదని వాపోయింది. అలాగే ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు సైతం కార్యాలయానికి వెళ్లి రైతు భరోసా గురించి ఏఈవో, ఏవోతో ఆరా తీశారు. దీనికి అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ప్రభుత్వమే డబ్బులు వేయలేదని.. దీనికి తాము కారణం కాదని సర్దిచెప్పారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రైతు భరోసా కోసం కార్యాలయానికి వచ్చిన రైతులు

యువత ఆదర్శం

- సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు

మదనాపురం, జూన్ 19 : మదనాపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కొందరు యువకులు గురువారం ఎర్రగట్టు నుంచి అజ్జకొల్లు గ్రామం వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు ఆటో యూనియన్ వారి సాయంతో కావలి అశోక్ కుమార్ అనే యువకుడు సొంత ఖర్చులు రూ.20 వేలు వెచ్చించి డస్ట్, మిక్సింగ్ కలిపి 5 కిలోమీటర్లు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా కావలి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎర్రగట్టు ప్రాంతం నుంచి అజ్జకొల్లు రోడ్డు గుంతలమయంగా మారిందని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేస్తున్న యువకులు

రైతులకు మొబైల్ ఫోన్లు ఇవ్వని పోలీసులు

ఫోన్ల కోసం రాజోళి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రైతులు

అలంపూర్, జూన్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దన్న రైతులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించిన విషయం విధితమే. రైతులను అరెస్టు చేసిన సమయంలో వారి వద్దనున్న మొబైల్ ఫోన్లు పోలీసులు రాజోళి పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేశారు. 14 రోజుల తర్వాత బెయిల్‌పై వచ్చిన రైతులు గురువారం వారి మొబైల్ ఫోన్ల కోసం రాజోళి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అయితే ఫోన్లు ఇప్పుడు ఇవ్వడానికి వీలుపడదని సీఐ చెప్పిన తర్వాత ఇస్తాం మరో రోజు రావాలని స్టేషన్ ఇన్‌చార్జి శిక్షణ ఎస్సై సతీశ్‌రెడ్డి చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాజకీయ ప్రసంగం

- పార్టీ మీటింగ్ కాదంటూ అడ్డుకున్న బీఆర్ఎస్ నేత
- పలువురి బుజ్జగింపులతో సద్దుమణిగిన వివాదం

మక్తల్, జూన్ 19 : రెడ్డి సేవా సమితి ఆత్మీయ సమ్మేళనంలో ఆత్మీయతకు బదులుగా రాజకీయ ప్రస్తావన తీసుకొచ్చి ఆరోపణలు చేస్తున్న పాల మూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ప్రసంగాన్ని బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి అడ్డుకున్నారు. నారాయణపేట జిల్లా రెడ్డి సేవాసమితి ఆత్మీయ సమ్మేళనం మక్తల్ ద్వారక గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి తోపాటు ఉమ్మడి జిల్లాలోని దేవరకద్ర, నారాయణపేట, పాల మూరు, జడ్చర్ల ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, అనిరుద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మెప్పు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మెచ్చుకుంటూ మాట్లాడుతుండగా , ఇదే సమావేశానికి హాజరైన మక్తల్ బీఆర్ఎస్ నాయకుడు రాజులు ఆశిరెడ్డి ప్రసంగానికి అడ్డుతగిలాడు. ఇది రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని ఆత్మీయ సమ్మేళనంలో ఆత్మీయంగానే మాట్లాడకోవాలి తప్పా, ఒక వ్యక్తి మెప్పుకోసం డబ్బా కొట్టుకునే సంభాషణలు ఇక్కడ చేయరాదని గట్టిగా వాదించాడు. దీంతో ఒక్కసారిగా కార్యక్రమం వేడెక్కిపోయింది.వేదికపై ఉన్న నాయకులు కల్పించుకొని ఇద్దరికి సర్ది చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం సద్దు మణిగింది. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని రాజకీయ పార్టీ సమావేశం మాదిరిగా మార్చడం ఎంతవరకు సమంజసమని పలువురు చర్చించుకున్నారు.

శిక్ష పడిందని పారిపోయేందుకు ప్రయత్నం

గద్వాల అర్బన్, జూన్ 19 : కోర్టులో శిక్ష పడిందన్న విషయం తెలుసుకున్న వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నం చేసిన ఘటన గురువారం గద్వాల కోర్టు వద్ద చోటు చేసుకున్నది. గద్వాల సీఐ టంగుటూరి శ్రీను కథనం ప్రకారం గట్టుకు చెందిన కృష్ణ 2016లో గ్రామంలోని పొలం వ్యవహారంలో దౌర్జన్యం చేశారని గట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య కేసు గద్వాల కోర్టులో కేసు నడుస్తుండగా కృష్ణకు గత 2024 ఫిబ్రవరి నెలలో 2 ఏండ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ అప్పటి న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. కాగా సదరు వ్యక్తి ఈ కేసు వ్యవహారంలో ఉన్నత కోర్టును ఆశ్రయించాడు. ఉన్నత కోర్టు కూడా సదరు వ్యక్తి అఫిల్‌ను కొట్టివేసి కింది కోర్టు విధించిన శిక్షనే అమలు చేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో శిక్ష పడుతుందని కృష్ణ కోర్టు ప్రాంగణం నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా అతడిని అదుపులోకి తీసుకొని జడ్జి ఎదుట హాజరుపర్చి రిమాండ్ చేశారు